ఘనంగా ఆకాశదీపోత్సవం


ఆకాశదిపోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని అంజనేయస్వామి ఆలయం ఆవరణలోని శివాలయంవద్ద కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఆకాశదిపోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి.

కనులపండువగా క్షీరాభిషేకం

చిక్కడపల్లి : ఆర్టీసీ క్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలను ఆలయ వేద పండితులు నిర్వహించారు. ఆలయం ఆవరణలోని పార్వతిక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో స్వామివారికి ఈ సందర్భంగా క్షీరాభిషేకం కార్యక్రమాన్ని కనులపండువగా జరిగింది. ఏకవార రుద్రాభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీపపూజ, కార్తీక పురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ తదితర కార్యక్రమాలు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగాయి.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి : రవిచారి


జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని నారాయణగూడ జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి కార్పొరేటర్ కె.రవిచారి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రవిచారి మాట్లాడుతూ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి సెక్షన్ పరిధిలో ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, పాలమూరుబస్తీ, చిలకలగూడ సెక్షన్ పరిధిలోని బాకారం, ఎస్వీ చర్చి ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్య ప్రాంతంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, మ్యాన్‌హోల్స్‌ను రిపేర్ చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ డీజీఎం మోహన్‌రావు, బీజేపీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ముషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఇందిరానగర్ హిందూ శ్మశానవాటిక తదితర ప్రాంతాల్లో సోమవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజిస్ట్ సూపర్‌వైజర్ రమేష్ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్ సెకండ్ వెంచర్, సంజీవయ్యనగర్, గుల్షన్‌నగర్‌లో దోమలబెడద తీవ్రం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పేర్కొన్నారు.


కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌ను సన్మానిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

కాంగ్రెస్‌కు సేవాదళ్ వెన్నెముక

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు వెన్నెముక వంటి వారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం లలితానగర్‌లో సికింద్రాబాద్ జిల్లా పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు కరణం సురేష్ ఆధ్వర్యంలో సేవాదళ్ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సేవాదళ్ బలోపేతం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం పాటుపడాలన్నారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మాట్లాడుతూ సేవాదళ్ పటిష్టతకు కరణం సురేష్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు ముజీద్, కాంగ్రెస్ సేవాదళ్ నా యకులు మేడి సురేష్, ఆనంద్ ముదిరాజ్, విజయ్‌యాదవ్, వల్లపురెడ్డి, జయకుమార్, భాస్కర్, పుస్తకాల కవిత, గజ్జెల కవిత, నరేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్

ఎస్‌ఆర్‌ఎస్పీ రెండవ దశకు బీఎన్‌రెడ్డి పేరుపెట్టాలి

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఆర్‌ఎస్పీ రెండవ దశకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు బీఎన్‌రెడ్డి పేరుపెట్టాలని, సూర్యాపేట జిల్లాకు ఆయన పేరుపెట్టాలని, అయన పేరు మీద స్ఫూర్తివనం ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో అఖిలభారత రైతు సమాఖ్య ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమాఖ్య ఉపాధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి జక్కుల వెంకటయ్య, రైతుకూలీ సంఘం అధ్యక్షుడు నర్సింహ, బీఎన్.రెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, అల్లుడు మల్లు కపోతంరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు కుమారస్వామి, ఎస్.రెడ్డి, సుకన్య, రాగసుధ తదితరులు మాట్లాడారు. ఎస్‌ఆర్‌ఎస్పీ రెండవ దశకు మాజీమంత్రి దామోదర్‌రెడ్డి పేరు పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సీఎం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సుందరయ్యపార్కు వాకర్లకు విశేష సేవలందిస్తున్న వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ మాజీ అధ్యక్షుడు, ట్విన్ సిటీస్ జువెల్లరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి కృష్ణను సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి


ఆటో కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కాలేరు పద్మావెంకటేష్, బి.వెంకట్‌రెడ్డి


ముషీరాబాద్‌లో ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, వై. శ్రీనివాస్‌రావు


ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ

ఆటో కార్మికులకు 12వేల జీవనభృతి చెల్లించాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాంనగర్/నల్లకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ రూ.12వేల జీవనభృతిని వెంటనే చెల్లించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఇచ్చిన ఆటో కార్మికులకు మద్దతు నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ దంపతులు బి పద్మావెంకట్‌రెడ్డి, అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆటోలలో బాగ్‌అంబర్‌పేటలోని రెడ్‌బిల్డింగ్ చౌరస్తా ఆటోస్టాండ్ వరకు ప్రయాణం చేశారు. అనంతరం అక్కడ ఆటో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అబద్ధం చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఆటో కార్మికులకు జీవనభృతి చెల్లించకపోవడంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని, దీనికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోలకు గిరాకి పూర్తిగా పడిపోయి వారి జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల నాయకత్వంలో బీఆర్‌ఎస్ తరఫున పోరాటం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఆటో కార్మికులకు తన వంతు సహకారం అందిస్తామని చెప్పారు. జంటనగరాలలోని ఆటో కార్మికులందరూ బీఆర్‌ఎస్‌కి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించి కేసీఆర్, కేటీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మూడు మార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన దివంగత మాగంటి గోపీనాథ్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. మాగంటి గోపీనాథ్ అందించిన సేవలను గుర్తించి ఆయన సతీమణి మాగంటి సునీతకు ప్రజలు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు బి పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు గెల్వయ్య, శ్రీరాములు ముదిరాజ్, విజయేంద్రసాగర్, రామకృష్ణ, లింగారావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్ అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ముషీరాబాద్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు ఆటో డ్రైవర్లతో కలిసి ప్లకార్డులతో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు 1000 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడంలేదని విమర్శించారు. కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసే విధంగా నిత్యం చాలాన్‌లు రాయడం వల్ల 161మంది ఆటో డ్రైవర్లు గత 22 నెలల్లో మృతి చెందారని ఆరోపించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై వేధింపులు మానుకొని వారి ఉపాధిని మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు బింగి నవీన్, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, పార్టీ నాయకులు వంగాల నర్సింగ్ రావు, సుమన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయంపై హర్షం

చిక్కడపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో చిలుకూరు హరిప్రసాద్ మూడోసారి సంయుక్త కార్యదర్శిగా ఎన్నికై హ్యాట్రిక్ విజయాలు సాధించడం పట్ల మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు వినోద్‌కుమార్, కట్టెల సుభాష్‌లు హర్షం ప్రకటించారు. వెయ్యి ఓట్లలో ఆరువందల ఓట్లు పోల్‌కాగా 157 ఓట్ల ఆధిక్యంతో హరిప్రసాద్ తన సమీప ప్రత్యర్థిపై గెలవడం అభినందనీయమన్నారు.


జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని వెంగళరావునగర్‌లో జరిగిన ఇంటింటి పాదయాత్రలో పాల్గొని పార్టీ గెలుపుకోసం ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ ఎయాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఎ ప్రభాకర్ గంగపుత్ర, రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, పరిమళ్‌కుమార్, కుమార్‌గౌడ్ పాల్గొని ప్రచారం చేశారు. - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరుతూ రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సిరిగిరి శ్యాం, బాబర్, మసూద్ అహ్మద్, రహీద్, రేషం మల్లేషం, నేత శ్రీనివాస్, గోపీ, శ్యాం తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

యువత రక్తదానంపై ముందుకు రావాలి

- ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ నర్సయ్య


రక్తదానం చేస్తున్న ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య, బీజేపీ నేత కె.లక్ష్మణ్‌కుమార్

నల్లకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నేటి యువత రక్తదానంపై ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్య సూచించారు. రక్తదానం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. సోమవారం అంబర్‌పేటలో జైగురుదేవ్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల యువత మరింత ఆరోగ్యవంతులుగా ఉండగలరని అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ తాను ఇప్పటికే 27మార్లు రక్తదానం చేశానని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి డీసీపీ నిర్వాహక సంస్థ పక్షాన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో..

బర్కత్‌పుర : తూర్పు మండలం పోలీసుల ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్‌శ్యాం, కాచిగూడ పీఎస్ అడ్మిని ఎస్‌ఐ ఎస్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ అధికారిగా అనన్యప్రియ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.అనన్యప్రియ

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అధికారిగా 2022 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ పోస్టల్ సర్వీస్(ఐపీఓఎస్) కవాడిగూడలోని పోస్టాఫీస్ కార్యాలయంలో ఎం.అనన్యప్రియ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహారాష్ట్ర నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ 275 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారబాద్‌లోని ప్రధాన ప్రాంతాలు తమ పరిధిలోకి వస్తాయన్నారు. తమ డివిజన్ పరిధిలో మూడు హెడ్ పోస్టాఫీసులు, 77 సబ్‌పోస్టాఫీసులు, 226 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయన్నారు. వీటి ద్వారా ప్రజలకు మెరుగైన పోస్టల్ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ అంతట పోస్టల్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి, సేవా బట్వాడాను మెరుగుపరచడానికి, పౌర కేంద్రీకృత విధానాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామని అనన్యప్రియ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను పోస్టల్ సిబ్బందితో పాటు పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ పాలన


మాట్లాడుతున్న సయ్యద్ కమల్ అథర్, ఆర్.మానసయ్య, పీ.జే.జేమ్స్, సార్యయాదవ్

నల్లకుంట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ పాసిస్టు పాలన కొనసాగిస్తుందని ఆలిండియా కన్వెన్షన్ అగైనెస్ట్ ఆర్‌ఎస్‌ఎస్ పాసిజం నేతలు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఆర్‌ఎస్‌ఎస్ అణచివేతకు పాల్పడుతుందని విమర్శించారు. అన్నివర్గాల ఏకీకృతమైన భారతదేశంపై నేడు ఆర్‌ఎస్‌ఎస్ మెజారిటీ హిందూదేశంగా స్థాపించాలనే లక్ష్యంతో పని చేస్తుందని ధ్వజమెత్తారు. దీంతో దళితులు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారని, ముస్లింలు దేశంలో రెండవ తరగతి పౌరులవుతున్నారని వాపోయారు. దీన్ని అడ్డుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సోమవారం హైదర్‌గూడలోని ఆర్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా కన్వెన్షన్ అగైనెస్ట్ ఆర్‌ఎస్‌ఎస్ పాసిజం చైర్మన్ సయ్యద్ కమల్ అథర్, జనరల్ కన్వీనర్ ఆర్.మానసయ్య, ప్రతినిధులు పీ.జే.జేమ్స్, సార్యయాదవ్, న్యాయవాది మహ్మద్ వాసీమ్, ఫసీయుద్దీన్ తదితరులు మాట్లాడారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు కేంద్రంలోని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాసిజంతో మానవ హక్కుల ఉల్లంఘన కొనసాగుతుందని ఆరోపించారు. ముఖ్యంగా రిజర్వేషన్లను ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకిస్తుందని, ఈ నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. బాబ్రీ మసీదును కూల్చివేసిన రోజు డిసెంబర్ 6వ తేదీన గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పాసిజానికి వ్యతిరేకంగా జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రజనీకాంత్, నాగరాజు, అశోక్‌రెడ్డి

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

రాంనగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు, సహాయ కార్యదర్శి ఎం.మమత, ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఫీజులు విడుదల చేయకపోతే పెద్దఎత్తున చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు. ఫీజుల విడుదల కోసం ఈనెల 30న విద్య సంస్థలు, యూనివర్సిటీలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, లెనిన్, నాగేందర్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రైలు ప్రయాణికుల బంగారు నగలు, నగదు తస్కరణ

బర్కత్‌పుర, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు రైలు ప్రయాణికురాళ్ల బంగారు నగలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన భాగ్య పద్మకుమార్ చేథ్రహ జైపూర్ - కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తుంది. మహారాష్ట్రలోని మోత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద ఆమె చేతిలోని హ్యాండ్ బ్యాగ్‌ను దొంగ లాక్కొని రైలు దిగి పారిపోయాడు. దానిలో 50 గ్రాముల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్ ఉంది. మరో సంఘటనలో చిత్తూరుకు చెందిన లక్ష్మీదేవి అజంత ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తుంది. ఉమిరి రైల్వే స్టేషన్ వద్ద ఆమె హ్యాండ్ బ్యాగులోని పర్సును దొంగలు తస్కరించారు. పర్సులో 16 గ్రాముల బంగారు ఆభరణాలు, 3వేల నగదు, ఆధార్ కార్డు ఉంది. ఈ రెండు కేసులను నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు. మరో సంఘటనలో నేరేడ్‌మెట్‌కు చెందిన సుమన్‌వర్మ గ్వాలియర్ నుంచి కాచిగూడకు కర్నాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుంది. కాజీపేట వద్ద ఆమె హ్యాండ్ బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి ఉంది. దానిలో ఉన్న పర్సు కనిపించలేదు. ఆ పర్సులో 26 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. కేసు నమోదు చేసి కాజీపేట రైల్వే స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని కూలీ మృతి

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కూలీ మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం కూలిపనిచేస్తూ జీవనం సాగిస్తున్న బండబాబు(37) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- సెంట్రల్‌జోన్ డీసీపీ కె. శిల్పవల్లి


రక్తదానం చేసిన వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ యాదగిరి, సీఐలు బోస్ కిరణ్, అంజద్‌అలీ, వెంకటలక్ష్మి

చిక్కడపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానం అని సెంట్రల్‌జోన్ డీసీపీ కె. శిల్పవల్లి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కల్యాణమండపంలో సోమవారం చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్ పీఎస్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు అమరవీరుల మహోన్నత త్యాగాలకు నివాళిగా, సామాజిక సేవ పట్ల తమ నిబద్ధతను చాటుతూ ఈ రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. ముఖ్యంగా వంశపారంపర్యంగా వచ్చే రక్త రుగ్మత అయిన తలసేమియాతో బాధపడుతున్న రోగులకు సహాయం అందించేందుకు ఈ శిబిరాన్ని సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్. రమేష్‌కుమార్, రెండు పీఎస్‌ల ఇన్‌స్పెక్టర్లు రాజునాయక్, రాంబాబు, ఎస్‌ఐలు, సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ శిల్పవల్లితో పాటు సిబ్బంది, నగర పౌరులు మొత్తం 118మంది పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. డీసీపీ మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల ద్వారా ప్రతి ఏడాది వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారని వారిలో చాలామందికి సకాలంలో రక్తం అందకపోవడం ఒక కారణమన్నారు. తలసేమియా రోగులకు ప్రతి 15రోజులకు ఒకసారి రక్తం అవసరం అవుతుందని తలసేమియా అనేది అవగాహనతో నివారించతగిన వ్యాధి అన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలను పోలీసు అధికారులు, స్వచ్ఛందసంస్థలు, బ్లడ్‌బ్యాంక్స్, ఆస్పత్రులవారిని అభినందించారు. పోలీసు అధికారులు, బ్లడ్‌బ్యాంక్‌కు సంబంధించిన డాక్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న డీసీపీ శిల్పవల్లి


రక్తదానం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజునాయక్


రక్తదానం చేస్తున్న నల్లకుంట సీఐ మారుతిప్రసాద్

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

కవాడిగూడ : రక్తదానం మహాప్రాణదానమని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రక్షించాలని సెంట్రల్ జోన్ డీసీపీ కె శిల్పవల్లి సూచించారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గాంధీనగర్ ఏసీపీ సబ్‌డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ బోయగూడలో ఉన్న ముదిరాజ్ భవన్‌లో పోలీసులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులతో పాటు స్టేషన్ పరిధిలో ఉన్న వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి సెంట్రల్‌జోన్ డీసీపీ కె శిల్పవల్లి, గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ యాదగిరి, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌కుమార్, గాంధీనగర్, దోమలగూడ సీఐలు బోస్ కిరణ్, ఎండీ అంజద్‌అలీ, ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఐలు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, ఎస్‌ఐలు నర్సింహ, హరీష్, లికిత్ సాయి, మౌనిక, కాంతారావు, దోమలగూడ ఎస్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, వెంకటేష్, గాంధీనగర్ ఎస్‌ఐలు పెంటాగౌడ్, కార్తీక్‌గౌడ్, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు వలంటీర్లు పాల్గొని రక్తదానం చేశారు.